సోమిరెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పండి



వైఎస్సార్‌సీపీలో చేరిన కోడూరు పంచాయతీ నాయకులతో మంత్రి కాకాణి



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇస్కపాళెం నేతలతో కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : అవినీతి, అరాచకాలకు కేరాఫ్ అయిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి నియోజకవర్గం నుంచి శాశ్వతంగా సాగనంపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. కావల్‌రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో గురువారం కోడూరు పంచాయతీ ముక్కంటమ్మ గిరిజన కాలనీకి చెందిన 200 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ మేరకు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాకాణి వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ వలసలు అధికమవుతుండడంతో ఆ పార్టీ కనుమరుగయ్యే స్థితికి చేరుకుందన్నారు. సోమిరెడ్డికి ఎన్నికల ముందే తన పతనం కనిపిస్తోందన్నారు. టీడీపీ నుంచి పార్టీలోకి వస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి అన్నిరకాలుగా అండగా నిలుస్తానని మంత్రి కాకాణి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కావల్‌రెడ్డి రవీంద్రారెడ్డి, తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రరెడ్డి, నాయకులు కావల్‌రెడ్డి నరేంద్రరెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాళెంలో..

ఇస్కపాళెం పంచాయతీకి చెందిన 18 టీడీపీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాకాణి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మలిశెట్టి చంద్రశేఖర్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- బాబు వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయి
- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



గుమ్మళ్లదిబ్బలో ప్రజలకు నమస్కారం చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరి మన్ననలు పొందుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమ్మిపాళెం, గుమ్మళ్లదిబ్బ గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో అభిమానం ఉందని, అందుకే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. జమ్మిపాళెం గ్రామంలో రూ.19.75 కోట్లు నేరుగా పేదలకు అందినట్లు తెలియజేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని వివరించారు. గడిచిన ఐదేళ్లలో ఏనాడు కన్నెత్తి చూడని టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్‌లు ప్రస్తుతం ఎన్నికల సమయానికి ప్రజలను మోసం చేసేందుకు పని కట్టుకుని ఊర్లమీద పడ్డాయని దుయ్యబట్టారు. ఇంత కాలం టీడీపీకి పనిచేసిన వారిని పక్కనబెట్టి డబ్బు సంచులతో వచ్చిన ప్రశాంతమ్మకు సీటు ఇచ్చారన్నారు. నెల్లూరులో ఓ ముస్లింకు, కందుకూరులో యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారన్న నెపంతో వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

జమ్మిపాళెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత వంశీరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రజానీకం ఎమ్మెల్యే ప్రసన్నకు ఘన స్వాగతం పలికారు. దారిపొడవనా పూల వర్షం కురిపించడంతో పాటు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం గుమ్మళ్లదిబ్బలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమన్వయంతో వేలాది మంది ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, విజయ్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, వినీత్‌కుమార్‌రెడ్డి, నరసింహులురెడ్డి, వెంకటరమణారెడ్డి, పందెం సుధా, మీరారెడ్డి, మిత్రారెడ్డి, స్థానిక ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

17 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 17 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఫోర్త్ ఇయర్ డిగ్రీ విత్ రీసెర్చ్ ఏడో సెమిస్టర్ పరీక్షకు 17 మంది హాజరయ్యారని తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 305 మందికి గానూ 288 మంది హాజరై 17 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు చెన్నారెడ్డిపాళెం బాలిక



పొదలకూరు : జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలుకూరు శ్రీవల్లి ఎంపికైనట్లు క్రికెట్ అకాడమి కోచ్ మనోహర్ గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన శ్రీవల్లిని అండర్–17 టెన్నిస్ బాల్ క్రికెట్ ఏపీ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో శ్రీవల్లి పాల్గొంటారు. దీనిపై శ్రీవల్లి తండ్రి అక్కెం బుజ్జిరెడ్డితో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1,397 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోల్

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1,397 మంది పోస్టల్ బ్యాలెట్ రూపంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈనెల 8వ తేదీ నాటికి 1,379 మంది ఓటు హక్కు వినియోగించుకోగా గురువారం 18 మంది ఓటు వేశారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కోవూరు : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : మాలమహానాడు జిల్లా యువత అధ్యక్షుడు బల్లి శరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెలిచెర్ల సాయి ఆధ్వర్యంలో సుమారు వంద మంది యువత గురువారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేశారు. గుమ్మళ్లదిబ్బలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలతో ఇటీవల టీడీపీలో చేరామని, అక్కడ దళితుల పట్ల జరుగుతున్న అవమానాలు భరించలేక తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. దళితలందరూ ఏకమై వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

కొరుటూరులో..

ఇందుకూరుపేట : మండలంలోని కొరుటూరులో పంచాయతీ వార్డు మెంబర్ పుష్ప, వైఎస్సార్‌సీపీ నేతలు ఎండ్ల రవికుమార్, షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పామంజి శ్రీనివాసులు, ఎంపీటీసీ స్వర్ణా శ్రీనివాసులురెడ్డి, అర్జున తులసీరామ్, ఏజియా తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాల చేరిక

విడవలూరు : మండలంలోని రామతీర్థం పంచాయతీ రామలింగాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాషాతో పాటు ఆయన అనుచరులైన 20 కుటుంబాలు టీడీపీని వీడి గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. విడవలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి నివాసంలో ఈ మేరకు ఆయన పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాలే తిరిగి ఆయన్ను ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోపెడుతాయని తెలియజేశారు. 2024లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : కొరుటూరులో..



విడవలూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు

మంత్రి కాకాణి పరామర్శ

వెంకటాచలం : మండలంలోని తిరుమలమ్మపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాతు మల్లికార్జున(58) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రాత్రి తిరుమలమ్మపాళేనికి చేరుకుని మల్లికార్జున మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన మల్లికార్జున మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని మంత్రి కాకాణి అన్నారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఓటేయండి



మనుబోలు : వడ్డపూడిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న పూజిత

పొదలకూరు : రానున్న ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమానికి ఓటేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని మారుతీనగర్‌లో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఎస్‌కే ఖాదర్, వార్డుసభ్యులు చెరుకూరు ప్రసాద్, బెల్లకొండ ప్రసాద్, స్థానిక నేత వాకాటి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిరదవోలులో..

మండలంలోని బిరదవోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మూడో పర్యాయం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు, లక్ష్మణరెడ్డి, బడుగు శ్రీహరి, లక్ష్మయ్య, ఇంద్రసేన్‌గౌడ్, మోహన్‌రెడ్డి, పెంచలరెడ్డి, గోపాలనాయుడు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ప్రచారం

పట్టణంలోని ఆర్యవైశ్యులు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలో అభివృద్ధి పనులు చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు హేమంత్, తన్నీరు సుందరరాజా, కేసర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

నాన్నను ఆశీర్వదించండి

మనుబోలు : ఐదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచిన నాన్నను మరోసారి ఓటుతో ఆశీర్వదించి గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత కోరారు. మనుబోలు మండలం వడ్డపూడి, గొట్లపాళెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలు, మహిళలను పలకరిస్తూ గత ఐదేళ్లుగా కాకాణి చేసిన సేవలను వారికి వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన వైనాన్ని గుర్తుచేశారు. కాకాణి మంత్రిలా కాకుండా ఇంటి బిడ్డలా సేవలందించారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు.



పొదలకూరు : మారుతీనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



తోటపల్లిగూడూరు : ముంగళదొరువు పంచాయతీలో..

కాకాణితోనే పిడూరు సమగ్రాభివృద్ధి

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోనే పిడూరు గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి అన్నారు. పిడూరు గ్రామంలో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమం పిడూరు గ్రామ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇంతలా గ్రామ అభివృద్ధికి సహకరించిన కాకాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఉన్నం లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఈగా సురేష్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి హ్యాట్రిక్ విజయాన్ని అందించండి

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ కోరారు. వైఎస్సార్‌సీపీ నేత కోనేటి రాజు ఆధ్వర్యంలో ముంగళదొరువు గ్రామంలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ మంత్రి కాకాణి సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కరోనా కష్టకాలంలో సర్వేపల్లి ప్రజలకు అండగా నిలిచి రూ.3 కోట్లతో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులతో పాటు మందులను పంపిణీ చేశారన్నారు. ప్రజలు మరోసారి ఆదరించి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే సర్వేపల్లి అభివృద్ధికి మరింతగా కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకుల మధు, వెడిచర్ల శ్రీనివాసులుగౌడ్, వేగూరు శ్రీనివాసులు, ముసలి పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : బిరదవోలులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు



పొదలకూరు : పట్టణంలో ఆర్యవైశ్యుల ఎన్నికల ప్రచారం



మనుబోలు : పిడూరులో ప్రచారం చేస్తున్న సాయిమోహన్‌రెడ్డి, నాయకులు

పేదల ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గీతారెడ్డి, పూజారెడ్డి

కొడవలూరు : పేదల పక్షపాతి ప్రభుత్వమైన వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ మండలంలోని తాటాకులదిన్నె, పెమ్మారెడ్డిపాళెంలలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పేదలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అందువల్లే పేదల అభ్యున్నతి కోసం 33 సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలంతా సంతోషంగా ఉండేలా చేశారన్నారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ధనవంతులు బరిలో ఉన్నారని, వారి ప్రలోభాలకు లోనై ఓటు వేస్తే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. చైతన్యవంతులైన కోవూరు ప్రజలు ధనవంతులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, వల్లాపురం నవీన్, స్థానిక నేత బద్దెపూడి సుధీర్ పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..

స్థానిక బజారు సెంటర్, రైటర్‌తోపు, కుమ్మరి వీధుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాలి జ్యోతి మాట్లాడుతూ నార్తురాజుపాళేన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించుకుని రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లాపై అవగాహన ఉన్న ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించుకుంటే జిల్లా సమగ్రాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పోశింరెడ్డి అనిల్‌రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కాకాణి శ్రీనివాసులు, గాలి సునీల్‌కుమార్, ఎం.ప్రసన్నకుమార్, వెంకటేశ్వరరావు, రవీంద్రరెడ్డి, పి.శివ పాల్గొన్నారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలంలోని జొన్నవాడ గ్రామంలో కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

ఇందుకూరుపేట : రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని మైపాడు ఎంపీటీసీ సభ్యుడు కూనంగారి రమణయ్య కోరారు. మండలంలోని మైపాడు గ్రామం పడమరపాళెంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేశారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : తాటాకులదిన్నెలో ప్రచారం చేస్తున్న చలపతిరావు



బుచ్చి మండలం జొన్నవాడ గ్రామంలో..



ఇందుకూరుపేట : మైపాడు పడమరపాళెంలో..



కొడవలూరు : నార్తురాజుపాళెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రెక్కల కష్టానికి నవరత్నాల భరోసా

రెక్కల కష్టంతో జీవించే ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు ఆధారంగా మారాయి. ఆడ బిడ్డలను ఉన్నతంగా చదివించాలన్న వారి కోరిక నెరవేరుతోంది. అనారోగ్య పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ బాసటగా నిలిచింది. ఏళ్లనాటి సొంతింటి కల సాకారమైంది. ఇలా నవరత్నాల్లోని ప్రతి పథకం ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది.



భార్య, కుమార్తెతో తాళ్ల రాజా

పొదలకూరు : మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మిక కుటుంబానికి చెందిన తాళ్ల రాజా, ప్రసన్న దంపతులది దిగువ మధ్యతరగతి కుటుంబం. వీరికి ఇద్దరు కుమార్తెలు యామిని, హారిక సంతానం. మొదటి నుంచి ఆడబిడ్డలను ఉన్నతంగా చదివించాలనేది దంపతుల కోరిక. అయితే కల్లుగీత కుటుంబం కావడం వల్ల కులవృత్తిని చేసుకుంటూ ఉన్న కాస్త భూమిలో కూరగాయలు పండించుకుని జీవించేవారు. ఆలోచనలు ఉన్నతంగా ఉన్నా పిల్లలను పెద్ద చదువులు చదివించే ఆర్థిక స్తోమత లేదు. అప్పుడెప్పుడో రాజా తండ్రి తాళ్ల రత్నయ్యకు కిడ్నీ జబ్బు చేస్తే దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా డయాలసిస్ చేయించుకుని కొంతకాలం జీవించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాల ద్వారా ఆ కుటుంబం ఎలాంటి లబ్ధి పొందలేదు. దీంతో పిల్లల ఉన్నత చదువులు కలగానే మిగిలిపోతుందని ఆవేదన చెందేవారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ వెలుగులు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత సంక్షేమ పథకాల అమలు వేగం పెరిగింది. దీంతో ఆ కుటుంబంలో వెలుగులు నిండాయి. స్థానికంగా ఇంటర్ పూర్తిచేసుకున్న పెద్దమ్మాయి యామిని రూపాయి ఖర్చు లేకుండా గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సీఎస్‌సీ చేరి మూడో ఏడాదైంది. ఆమెకు విద్యా, వసతీ దీవెన పథకాలు అందుతున్నందున చక్కగా చదువుకుంటోంది. రెండో అమ్మాయి హారికకు అమ్మఒడి పథకం వర్తించడం వల్ల ఇంటర్ పూర్తి చేసుకుంది. పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్న ప్రసన్న తీసుకున్న బ్యాంకు రుణం ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో రూ.50 వేలు బ్యాంకు ఖాతాకు నేరుగా జమయ్యాయి. రాజాకు ఉన్న కొద్దిపాటి పొలానికి రైతుభరోసా పథకంలో ఏడాదికి పెట్టుబడి నగదు కింద రూ.13,500 బ్యాంకులో జమైంది. పక్కా ఇల్లు లేని రాజా సంక్షేమ పథకాల ద్వారా కుదురుకున్నాక వైఎస్సార్ గృహనిర్మాణం కింద రూ.1.80 లక్షలు పొంది మరికొంత మొత్తం జోడించి చక్కటి ఇంటిని నిర్మించుకుని ఆడబిడ్డలను చదివించుకుంటూ హాయిగా జీవిస్తున్నారు.



జగనన్న వల్లే ఆడపిల్లల చదువులు

మా అదృష్టం కొద్ది జగనన్న ప్రభుత్వం ఏర్పడింది. ఫలితంగా ఇద్దరు ఆడబిడ్డల చదువులు సవ్యంగా సాగిపోతున్నాయి. లేదంటే రూ.లక్షలు వెచ్చించి పెద్దచదువులు చదివించ లేకపోయేవాళ్లం. మా ఆశయాన్ని సీఎం జగన్ నెరవేర్చారు. ఆయనకు జీవితాంతం మా దంపతులం రుణపడి ఉంటాం. మా కుటుంబానికి ఆరు రకాల సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో నగదు అందింది.

– తాళ్ల రాజా, కుటుంబ యజమాని



రూపాయి ఖర్చు లేకుండా బీటెక్ చేస్తా..

అమ్మఒడి పథకం ద్వారా ఇంటర్ పూర్తి చేశాను. జగనన్న సీఎం అయితే రూపాయి ఖర్చు లేకుండా బీటెక్ చదువుతా. మళ్లీమళ్లీ ఆయనే సీఎం కావాలి. మా అక్క బీటెక్ చేస్తోందంటే జగనన్న సీఎంగా ఉండడమే కారణం. అందుకే తిరిగి ఆయన ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– హారిక, రాజా రెండో కుమార్తె